క్లుప్తంగా

గౌతమి నంది పురస్కారానికి 'వైరాగ్యం' ఎంపిక

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, విమర్శకుడు, భవానీ సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు వైరాగ్యం ప్రభాకర్‌ను గౌతమి నంది పురస్కారానికి ఎంపిక చేసినట్లు విశ్వ విఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు ఎస్వీఆర్.వెంకటేశ్, శ్రీ గౌతమేశ్వర గోసంరక్షణ సమితి అధ్యక్షుడు ఆకుల విద్యాసాగర్ గురుజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభాకర్ ఎన్నో రచనలు చేస్తూ సంపాదకుడిగా ఎంతోమంది కవులు, రచయితల రచనలతో పుస్తకాలు ప్రచురిస్తూ సాహిత్య సేవలందిస్తున్నారని కొనియాడారు. వాటికి గుర్తుగా ఉత్తమ సాహితీ గురు బిరుదుతోపాటు గౌతమి బంగారు నంది జాతీయ స్థాయి పురస్కారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అందజేస్తామన్నారు. జిల్లాలోని పలువురు కవులు, రచయితలు ఆయనను అభినందించారు.

బదిలీపై వెళ్తున్న ఆర్ఐకి సన్మానం



ఆర్ఐ రజనీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న తహసీల్దార్ నవీన్, ఉద్యోగులు, రేషన్ డీలర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేసి, గన్నేరువరం మండల తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయిన బి.రజనీకాంత్‌రెడ్డిని ఉద్యోగులు, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు గురువారం సన్మానించారు. ఆర్ఐగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ శంకర్, ఆర్ఐ వాస్తవిక్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు తాటి పూర్ణచందర్‌రావు, ప్రతినిధులు సాధినేని మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: రాజరాజేశ్వరి లైయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో క్లబ్ బాధ్యుడు శ్వేతన్ రెడ్డి జన్మదినం సందర్భంగా సుమారు 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, బాధ్యులు లంబు రాజిరెడ్డి, అరికొంతం రవీందర్ రెడ్డి, రావికంటి కృష్ణప్రసాద్, బద్దం మల్లారెడ్డి, రావికంటి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'వాణినికేతన్'లో బోనాలు



బోనాలతో పాఠశాల డైరెక్టర్, విద్యార్థులు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్లో గురువారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు అమ్మవారుగా, బాలురు పోతరాజుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల నుంచి జ్యోతినగర్ గుడి వరకు బోనాలను డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ తీసుకెళ్లారు. పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. పాఠశాల డైరెక్టర్ రేణుక, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒలింపిక్ రింగ్స్ ఆకృతిలో 'మానేరు' విద్యార్థులు



సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు గురువారం ఒలింపిక్ రింగ్స్ ఆకృతిలో కూర్చొని, ఆకట్టుకున్నారు. శుక్రవారం నుంచి పారిస్‌లో ఒలింపిక్ క్రీడలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ప్రదర్శన చేశారు. విద్యాసంస్థల అధినేత కడారి అనంత రెడ్డి మాట్లాడుతూ.. ఒలింపిక్ క్రీడల్లో మన దేశ క్రీడాకారులు అత్యధిక పతకాలను కై వసం చేసుకోవాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం



రాజన్న

సప్తగిరికాలనీ: మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా రామడుగు మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన కొత్తూరి రాజన్న గురువారం నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'మహిళా శక్తి'తో చేయూత

- పథకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం
- స్వశక్తి మహిళలకు ఆర్థికసాయం అందించేందుకు చర్యలు
- కరీంనగర్ మండలానికి 684 యూనిట్లు మంజూరు
- గ్రామాలవారీగా అవగాహన సదస్సులు
- యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక



ఇరుకుల్లలో సమావేశమైన స్వశక్తి సంఘం మహిళలు (ఫైల్)

కరీంనగర్‌రూరల్: స్వశక్తి సంఘాల మహిళలు వ్యాపారాల్లో రాణించి, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టింది. ఔత్సాహిక మహిళలను గుర్తించి, బ్యాంకు రుణం అందించి, వ్యాపారాలు చేయించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే స్వశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను అందిస్తుండగా మహిళా శక్తి పేరుతో మరింతగా ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల మొదటి వారం నుంచి స్వశక్తి సంఘాల మహిళలతో అధికారులు సమావేశాలను నిర్వహిస్తూ మహిళా శక్తి కింద ప్రారంభించే వ్యాపారాలపై అవగాహన కల్పిస్తున్నారు.

రూ.20 లక్షలు మంజూరయ్యే అవకాశం

కరీంనగర్ మండలంలో మొత్తం 684 యూనిట్ల ఏర్పాటుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. వీటిలో చిన్నతరహా పరిశ్రమలు, పాడి గేదెలు, పెరటి కోళ్లు, కోడిపిల్లల పెంపకం, క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్, కస్టమ్ హైరింగ్ సెంటర్ తదితర వ్యాపారాలున్నాయి. వ్యక్తిగతంగా రూ.2 లక్షల వరకు, గ్రూపుగా అయితే రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణం మంజూరయ్యే అవకాశం ఉంది. ఆసక్తి ఉన్న మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించి, లబ్ధిదారులను ఎంపిక చేపడుతున్నారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండానే పారదర్శకంగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.

మంజూరైన యూనిట్లు, ఎంపికైన లబ్ధిదారులు

యూనిట్లు	లక్ష్యం	లబ్ధిదారులు
చిన్నతరహా పరిశ్రమలు	472	429
పాడిగేదెలు	100	102
పెరటికోళ్లు	100	100
కోడిపిల్లలు	01	01
ఫుడ్ ప్రాసెసింగ్	09	03
మహిళా శక్తి క్యాంటీన్	01	01
కస్టమ్ హైరింగ్ సెంటర్	01	01

ఎంపిక చేస్తున్నాం..

గ్రామాల వారీగా స్వశక్తి సంఘాల మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేసి, లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం. చిన్న తరహా పరిశ్రమల యూనిట్ల ఎంపిక చివరి దశలో ఉంది. ఈ నెలాఖరు వరకు లబ్ధిదారులను గుర్తించి, ఆయా వ్యాపారాల్లో వారికి శిక్షణ ఇస్తాం.
– భార్గవ్, ఐకేపీ ఏపీఎం, కరీంనగర్ మండలం

స్వశక్తి సంఘాల వివరాలు

కరీంనగర్ మండలంలో 17 గ్రామాలున్నాయి. వీటిలో గ్రామైక్య సంఘాలు 32, స్వశక్తి సంఘాలు 898 కాగా, మొత్తం సభ్యులు 10,487 మంది ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్ మోదం.. ఖేదం

- భేష్ అంటున్న అధికార పక్షం
- ప్రజలను మాయ చేసేలా ఉందన్న విపక్షాలు
- విద్యను విస్మరించారని విద్యావేత్తల ఆరోపణ

కరీంనగర్: డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై కొంత మోదం.. కొంత ఖేదం అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికార పక్షం భేష్, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించారంటే.. విపక్షాలు పెదవి విరుసూ.. ప్రజలను మాయ చేసే బడ్జెట్ అంటూ విమర్శించారు.

రాజకీయ ప్రసంగంలా ఉంది



కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. దళితబంధు, రైతుబంధు, గొర్రెల పంపిణీ పథకం, మత్స్యకారులకు భరోసా వంటి పథకాల ఊసే లేదు. ఆరు గ్యారంటీలపై అతీగతి లేదు. బడ్జెట్ ప్రసంగం రాజకీయ ప్రసంగంలా ఉంది. – మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వర్సిటీలకు రూ.500 కోట్లేనా?



విద్యారంగాన్ని విస్మరించింది. బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి, 7.3 శాతమే కేటాయించింది. శాతవాహన యూనివర్సిటీకి రూ.200 కోట్లు ఇస్తారనుకుంటే అన్ని వర్సిటీలకు కలిపి రూ.500 కోట్లు ఇవ్వడం సరికాదు.
– మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

వ్యవసాయ రంగానికి మేలు



రాష్ట్ర బడ్జెట్ వ్యవసాయ రంగానికి, రైతులకు మేలు చేసేలా ఉంది. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీల అమలుతోపాటు వివిధ రంగాలకు కేటాయింపులు చేసింది. వైద్యరంగానికి పెద్దపీట వేసింది.
– మర్రి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి

ప్రజా వ్యతిరేక బడ్జెట్



ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్. నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500, రైతు భరోసా స్కీంకు నిధులు కేటాయించలేదు. ఇది కేవలం కొడంగల్ కోసమే ప్రవేశపెట్టిన బడ్జెట్. బీసీలకు నిధులు కేటాయించలేదు.
– కొట్టె మురళీకృష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు

ప్రాధాన్యత రంగాలకు అన్యాయం



బడ్జెట్‌లో ప్రాధాన్యత రంగాలకు అన్యాయం చేసింది. విద్య, వైద్యం, ఉత్పాదక రంగాలకు అరకొర నిధులే కేటాయించడం బాధాకరం. కరీంనగర్ జిల్లాకు మొండిచేయి చూపారు. మానేరు రివర్ ఫ్రంట్‌కు నిధుల్లేవు. – మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

అభివృద్ధిపై స్పష్టత లేదు



ఈ బడ్జెట్ రాబడి, ఖర్చుల లెక్క పత్రంలా ఉంది. కేటాయింపులు చెప్పడం మినహా భవిష్యత్తులో ఎలాంటి అభివృద్ధి చేయబోతున్నారనే దానిపై స్పష్టత లేదు. యథాతథ స్థితి విధానానికి ఊతమిస్తోంది. ఎన్నికల హామీలు కూడా నెరవేర్చలేని బడ్జెట్. – పి.సుగుణాకర్‌రావు, బీజేపీ సీనియర్ నాయకుడు

బకాయిలపై స్పష్టత లేదు



విద్యారంగానికి గతేడాది 21,389 కోట్లు కేటాయించగా.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.21,292 కోట్లే కేటాయించడం విచారకరం. పెండింగ్ ఫీజు రీయి ంబర్స్‌మెంట్ బకాయిలు రూ.7 వేల కోట్ల విడుదలపై స్పష్టత లేదు. బడ్జెట్‌ను సవరించి, విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
– రజనీకాంత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పునఃసమీక్షించాలి



విద్యారంగానికి కేటాయించిన నిధులు సరిపోవు. దీనిపై పునఃసమీక్షించి, నిధులు పెంచాలి. పాఠశాల విద్యలో సంస్కరణలు చేసేముందు తల్లిదండ్రులు, మేధావులు, విద్యావంతుల అభిప్రాయాలు తీసుకోవాలి.
– ముల్కల కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రజల ఆశలపై నీళ్లు



రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశల మీద నీళ్లు చల్లింది. దళితుల సంక్షేమానికి అరకొర నిధులే కేటాయించడం విచారకరం. రైతుబంధుపై స్పష్టత లేదు. ఈ బడ్జెట్ ఏ వర్గానికీ న్యాయం చేయలేదు. ఐటీ, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన పాలసీలు లేవు. – దామెర సత్యం, దళిత సంఘాల జేఏసీ ప్రతినిధి

బీసీలకు అరకొర



బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు సరిగా లేవు. జనాభాలో 56 శాతం ఉన్నవారి సంక్షేమానికి అరకొరగా పెట్టిన రూ.9,200 కోట్లు ఏవిధంగానూ సరిపోవు. ఇది బీసీలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. – నర్సింగోజు శ్రీనివాస్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు

విద్యారంగంపై నిర్లక్ష్యం



బడ్జెట్‌లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోంది. స్కాలర్‌షిప్, మెస్ బిల్లుల ప్రస్తావన లేకపోవడం ఆందోళనకరం. ఢిల్లీ, అస్సాం, హిమాచల్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు.
– కాంపెల్లి అర్విండ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

గిరిజనులను మోసం చేసింది



కాంగ్రెస్ గిరిజనులను మోసం చేసింది. బడ్జెట్ లెక్క ప్రకారం జనాభాలో 10 శాతం ఉన్న గిరిజనులకు రూ.22 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.17,056 కోట్లే కేటాయించడం సరికాదు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా హక్కుల కమిషన్ ఏర్పాటుకు హామీ కూడా ఇవ్వలేదు.
– బీమాసాహెబ్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

యువతకు నిరాశే..



బడ్జెట్‌లో యువతకు నిరాశే మిగిలింది. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కానీ, ప్రైవేట్ భాగస్వామ్యం కాకుండా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్ ఏర్పాటు ప్రస్తావన లేదు. యువజన, క్రీడారంగాలకు నిధులివ్వాలి.
– తిరుపతి, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీలకు అధిక నిధులు కేటాయించడంపై కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా, నగర శాఖలు సంబరాలు నిర్వహించాయి. నగరంలోని ఇందిరాచౌక్, రాజీవ్‌చౌక్‌ల వద్ద బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు లాభం చేకూరేలా కేటాయింపులు చేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపినా స్పందించని బీజేపీ నాయకులు, రాష్ట్ర బడ్జెట్‌పై నిరసనలు తెలపడం సిగ్గుచేటన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మైనార్టీ సెల్ జిల్లా, నగర అధ్యక్షులు ఎండీ.తాజ్, అహ్మద్ అలీ, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, నాయకులు సమద్ నవాబ్, శ్రవణ్ నాయక్, అబ్దుల్ రెహమాన్, సిరాజ్ హుస్సేన్, అక్బర్ అలీ, మహమ్మద్ ఆరిఫ్, నేహాల్ అహ్మద్ తదితరులున్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈసీ మెంబర్‌ను కలిసిన జిల్లా అధ్యక్షుడు



కరీంనగర్: ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ఈసీ మెంబర్ అబ్బగోని లక్ష్మీనర్సయ్యగౌడ్‌ను జిల్లా అధ్యక్షుడు తలకొక్కుల సదానందం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కరీంనగర్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వైస్ ప్రెసిడెంట్ ఎన్నం కుమార్, బొజ్జ తిరుపతి, ప్రేమ్, వెంకటేశ్వర్‌రావు, కిశోర్, సంజయ్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

ఆఫీసులన్నీ కొత్తపల్లిలోనే ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కొత్తపల్లి: మండలానికి సంబంధించిన తహసీల్దార్, మండల ప్రజా పరిషత్, వ్యవసాయ తదితర ప్రభుత్వ ఆఫీసులన్నీ కొత్తపల్లి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం చింతకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్లో పార్టీ మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు కె.రతన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కరుణాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన కార్యాలయాలన్నీ జిల్లా కేంద్రంలో ఉండటం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 95 శాతం నిధులు మంజూరు చేస్తోందన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు అనిల్‌కుమార్, అంజనీకుమార్, శ్రీనివాస్, రేణు, తిరుపతి, రంజిత్, కరుణాకర్ తదితరులున్నారు.

మున్నూరుకాపు లీగల్ సెల్ కన్వీనర్ నియామకం



రత్నాకర్

కరీంనగర్‌క్రైం: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం లీగల్ సెల్ కన్వీనర్‌గా న్యాయవాది, కరీంనగర్‌కు చెందిన ఒంటెల రత్నాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లీగల్ సెల్ ద్వారా ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారికి ఉచిత న్యాయ సహాయం అందేలా చూడాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ ఉపేందర్

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ ఉపేందర్ అన్నారు. గురువారం తీగలగుట్టపల్లిలోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల(ఎస్వీజేసీ)లో కరీంనగర్‌రూరల్ పోలీస్, యాంటీ నార్కోటిక్ బ్యూరో సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ కృష్ణమూర్తి, ఎస్సై శేఖర్, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

కూలిన పురాతన ఇల్లు



కరీంనగర్ కార్పొరేషన్: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలోని 3వ డివిజన్ పరిధి కిసాన్‌నగర్‌లో గురువారం ఓ పురాతన ఇల్లు కూలిపోయింది. కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ ఇచ్చిన సమాచారంతో తహసీల్దార్ రమేశ్, పట్టణ ప్రణాళిక అధికారి సంధ్య తదితరులు వచ్చి, ఆ ఇంటిని పరిశీలించారు.

'శ్రీ చైతన్య'లో గ్రీన్ ఇండియా మిషన్ ప్రోగ్రాం



మొక్కలు నాటిన సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: స్థానిక విద్యారణ్యపురి శ్రీ చైతన్య పాఠశాలలో అకాడమిక్స్‌లో భాగంగా గురువారం గ్రీన్ ఇండియా మిషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై, మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం ఎం.రాజు, రాజు, ప్రిన్సిపాల్ సుమన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురు వ్యక్తులకు కరీంనగర్ కోర్టు జైలుశిక్ష విధించింది. ట్రాఫిక్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 26 మందిని పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. ఇద్దరికి 5 రోజులు, ఒకరికి 3 రోజుల జైలుశిక్ష, రూ.6,500 జరిమానా, మిగతావారికి రూ.35,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పోలీస్‌స్టేషన్‌కు మరమ్మతు చేయించాలి



కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ: శిథిలావస్థలో ఉన్న కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌కు మరమ్మతు చేయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతి పత్రం అందించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించడంతో భవనం పూర్తిగా శిథిలమై, వర్షాలకు ఉరుస్తోందని, పోలీసులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. సంఘం నాయకులు జంగా కొమురయ్య, గరిగె కోటేశ్వర్, అందె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బ్యాగ్ అప్పగింత

కరీంనగర్ క్రైం: కరీంనగర్ బస్టాండ్‌లో గురువారం అర్చన అనే ప్రయాణికురాలు హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయిందని ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. గుర్తింపు కార్డుల ఆధారంగా ఆమెను పిలిపించి, అప్పగించామన్నారు. ఏఎస్సై లక్‌పతి, సిబ్బంది ఉన్నారు.

విద్యకు 30 శాతం నిధులివ్వాలి

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ శాతం నిధులు కేటాయించిందని, దాన్ని సవరించి 30 శాతం నిధులివ్వాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేవలం రూ.21,292 కోట్లే కేటాయించడం, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల ప్రస్తావన తేకపోవడం సరికాదన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటని సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ అన్నారు. 30 శాతం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. అన్ని యూనివర్సిటీలకు కలిపి రూ.500 కోట్లు కేటాయించారని, అవి ఏ మూలకు సరిపోతాయో చెప్పాలన్నారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రవితేజ, అనిల్, రాకేశ్, సోను, అజయ్, శ్రీనివాస్, ప్రవీణ్, అస్లాం తదితరులున్నారు.

కొత్త ఇన్సులేటర్ బిగింపు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌లో 33 కేవీ లైన్‌లోని ఓ విద్యుత్ స్తంభం ఇన్సులేటర్ పాడైంది. దీంతో గురువారం బొమ్మకల్, మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే కొత్త ఇన్సులేటర్ బిగించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఏఈ తిరుపతి, ఎస్ఎల్ఐ రఘుపతి, ఎల్ఐ కొండగట్టు, ఎల్ఎంలు ప్రకాశ్, ఫారుఖ్, జేఎల్ఎంలు చంద్రశేఖర్, శ్రీకాంత్, రఘు, మనోహర్, కిరణ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ టీచర్లకు అన్యాయం'

సప్తగిరికాలనీ: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు సంబంధించిన లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలను బ్యాక్ లాగ్ చేసి, ఆ పోస్టులను ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులతో భర్తీ చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ ఒక ప్రకటనలో కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీల లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలను ఓపెన్ కేటగిరీ వారికి బదలాయించేలా స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి జిల్లా అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. అన్ని జిల్లాల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో 12 పోస్టులు నష్టపోయారని తెలిపారు.

కళాశాలలో వనమహోత్సవం



సప్తగిరికాలనీ: స్థానిక డాక్టర్స్ స్ట్రీట్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యానికి, మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటరాజిరెడ్డి, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ ఉచిత వైద్య శిబిరం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ రజనీ ప్రియదర్శిని

కరీంనగర్‌టౌన్: వరల్డ్ ఐవీఎఫ్–ఎంబ్రియాలజీ డేను పురస్కరించుకొని గురువారం నగరంలోని రెనె ఆస్పత్రిలో సీనియర్ గైనకాలజిస్టు, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఐవీఎఫ్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది హాజరవగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రెనె హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బంగారి స్వామి, వైద్యులు దినకర్, నిఖిల్ లక్ష్మణ్, ప్రదీప్, దామోదర్ రెడ్డి, మౌనిక, అవనిజ, రతన్, అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.